సాక్షి నల్లగొండ

బుధవారం ၊ 10 ၊ జూలై ၊ 2024



యువకుల అరెస్ట్
గంజాయి విక్రయిస్తున్న యువకులను మంగళవారం హుజూర్‌నగర్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో



నిరుద్యోగులకు బాసటగా..
నల్లగొండ జెడ్పీ స్టడీ సెంటర్‌లో చదువుకుని ఇప్పటి వరకు 24 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు.
- 8లో

గరిష్టం / కనిష్టం
31 / 24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న శాంతి సంఘీభావ సంఘం సమావేశం

నల్లగొండ టౌన్ : అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమావేశం ఈ నెల ఈ నెల 11న ఉదయం 11 గంటలకు నల్లగొండలోని టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు జిల్లా యాదయ్య, అనంతుల శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ హాజరవుతారని పేర్కొన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని సర్వే



సర్వే చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ మంగళవారం నల్లగొండలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ పరీక్షలు వెంటనే వాయిదా వేయాలని, గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులను పెంచాలని కోరారు. వెంటనే జాబ్ కాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, నాయకులు నాగయ్య, మహేష్, యువరాజ్, దోసపాటి నవీన్, వర్షిత్‌కుమార్, చందు, తరుణ్, నరేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంల బదిలీ

నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లాలో పలువురు ఆర్టీసీ డిపో మేనేజర్లు బదిలీ అయినట్లు ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ డీఎం పాల్ ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ రీజియన్ల కార్గో ఏటీఎంగా, నల్లగొండ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి మిర్యాలగూడకు, రాజేంద్రనగర్ డీఎంగా పనిచేస్తున్న ఎం.శ్రీనాథ్ నల్లగొండ డిపోకు, ఖాళీగా ఉన్న దేవరకొండ డిపో మేనేజర్‌గా అదే డిపోలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న రమేష్‌బాబును నియమించినట్లు వెల్లడించారు.

నాగయ్యకు జైల్ బంక్‌లో ఉపాధి



జైలు బంక్‌లో పని చేస్తున్న నాగయ్య

నల్లగొండ క్రైం : ఓటుకు కోట్లు కేసులో ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డికి చర్లపల్లి జైలులో సహాయకుడిగా ఉన్న జీవిత ఖైదీ నాగయ్య ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. నాగయ్యకు నల్లగొండ జైల్‌ఖానాలోని పెట్రోలు బంక్‌లో జైళ్ల శాఖ ఉపాధి కల్పించింది. మంగళవారం నుంచి ఆయన పెట్రోలు బంక్‌లో పని చేస్తున్నారు. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన నాగయ్య జైల్‌లో ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డికి చర్లపల్లి జైల్‌లో సహాయకుడిగా ఉన్నాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత తనను కలిస్తే ఉపాధి చూపిస్తామని నాగయ్యకు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు. జైలు నుంచి విడుదల కావడంతో ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నాల్లో భాగంగా నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డిని కలిశానని ఆయన కొద్ది రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిపిస్తానని చెప్పారని నాగయ్య పేర్కొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ వంటి పూజలు నిర్వహించారు.



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు



ఆషాఢం గోరింటాకు..

ఆషాఢ మాసం సందర్భంగా నకిరేకల్ పట్టణంలో మాతృశక్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించి మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. - నకిరేకల్

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in ద్వారా ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్ష ఈ నెల 21న హైదరాబాద్‌లో ఉంటుందని, పూర్తి వివరాలకు 040–23546552, 9396621492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎంసీహెచ్ కిట్ ఆగింది!

- గతేడాది అక్టోబర్ నుంచి నిలిచిన సరఫరా
- 2022 ఆగస్టు నుంచి అందని ప్రోత్సాహకం
- న్యూట్రిషన్ కిట్లదీ అదే దారి..
- గర్భిణులు, బాలింతలకు తప్పని ఎదురుచూపు



మాతా శిశు ఆరోగ్య కేంద్రం కిట్

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఎంసీహెచ్ కిట్ పంపిణీ నిలిచిపోయింది. దీంతోపాటు గర్భిణులు, బాలింతలకు ప్రోత్సాహకాలు కూడా బంద్ అయ్యాయి. గర్భిణులకు అందజేసేన్యూట్రిషన్ కిట్ల పంపిణీ కూడా ఆగింది. దీంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి గురించి వైద్యులు, అధికారులను అడిగితే సమాధానం దాటవేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు కిట్లను సరఫరా చేస్తుందో, ప్రోత్సాహక నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందోనని గర్భిణులు, బాలింతలు ఎదురు చూస్తున్నారు.

కిట్‌లో 20 రకాల వస్తువులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. కిట్‌లో 20 రకాల వస్తువులను తల్లికి బిడ్డకు అవసరమైన వాటిని ఉంచి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలోనే అందజేసి.. ప్రభుత్వ వాహనంలో వారిని ఇళ్ల వద్దకు చేరవేసేవారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ కిట్ పేరును ఎంసీహెచ్ కిట్టుగా మార్చింది. పేరు మార్చిన తర్వాత అప్పటికే ఉన్న కేసీఆర్‌కిట్లపై ఎంసీహెచ్ కిట్లుగా రాసి స్టిక్కర్లను అతికించి బాలింతలకు అందజేశారు. కిట్లు సరఫరా కాకపోవడంతో గతేడాది అక్టోబర్ నుంచి పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1281 మంది బాలింతలకు ఎంసీహెచ్ కిట్లు అందజేయాల్సి ఉంది. ఆస్పత్రుల్లో కిట్ల గురించి అడిగే బాలింతలకు సమాధానం చెప్పలేక వైద్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్లుగా నిలిచిన ప్రోత్సాహకం..

గర్భం దాల్చిన మహిళ మూడు నెలల నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరు నమోదు చేసుకుని నెల నెలా పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అమలు చేసింది. ఆడపిల్ల పుడితే రూ.13 వేల, మగబిడ్డ పుడితే రూ.12 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు చెకప్‌లు పూర్తయిన తర్వాత రూ.2 వేలు, ప్రసవించిన తర్వాత రూ.3 వేలు, బిడ్డకు వ్యాక్సినేషన్ తర్వాత రూ.2 వేలు, అన్ని వ్యాక్సినేషన్లు పూర్తయిన తర్వాత మిగతా డబ్బులను తల్లుల ఖాతాల్లో వేసేవారు. ప్రస్తుతం ఈ ప్రోత్సాహకం కూడా పూర్తిగా నిలిచిపోయింది. 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.31 కోట్ల 93 లక్షల 59 వేల ప్రోత్సాహక బకాయిలు తల్లుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం 1,06,452 మంది తల్లులు ఎదురు చూస్తున్నారు.

అందని పౌష్టికాహారం..

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా రక్తహీనత నుంచి రక్షించి మాతా శిశు మరణాలను తగ్గించేలా గత ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసింది. న్యూట్రిషన్ కిట్‌లో నెయ్యి, హార్లిక్స్, ఖర్జూరాలు, పల్లీ పట్టీ, తదితర వస్తువులను బుట్టలో పెట్టి అందజేసేవారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జీజీహెచ్‌లో పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆ కిట్ల పంపిణీ కూడా నిలిచిపోయి ఏడాది అవుతోంది.

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంసీహెచ్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు సరఫరా కావాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే అందజేస్తాం. ప్రోత్సాహకాల నిధులు కూడా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. విడుదలయ్యాక వెంటనే తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.
– డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డీఎంహెచ్‌ఓ

11, 12వ తేదీల్లో చెస్ టోర్నమెంట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రామగిరి (నల్లగొండ) : నల్లగొండలోని కేంద్రియ విద్యాలయం(కేవీ)లో ఈ నెల 11, 12 తేదీల్లో రీజనల్ స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ టి. పూర్ణచంద్ర చేతుల మీదుగా టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ రీజియన్‌లోని 72 కేంద్రియ విద్యాలయాల నుంచి 187 విద్యార్థులు, 34 మంది ఉపాధ్యాయులు పాల్గొననున్నట్లు తెలిపారు. అండర్–14, 17, 19 పోటీల్లో పాల్గొనే వారి నుంచి నేషనల్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ కె.కరుణాకర్‌రెడ్డి, ఏ.రవి కుమార్ పాల్గొన్నారు.

18న సూర్యాపేట పోస్టాఫీస్‌లో ఇంటర్వ్యూలు

భానుపురి (సూర్యాపేట) : తపాలా శాఖలో కమిషన్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 18న సూర్యాపేట పోస్టాఫీస్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సూర్యాపేట డివిజన్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి. సైదులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సూర్యాపేట డివిజన్‌లోని 347 పోస్టాఫీసుల పరిధిలో 18 ఏళ్లు నిండి 10వ తరగతి ఉత్తీర్ణులైనవారిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారు డివిజన్ పరిధిలో ఎక్కడైనా పనిచేసేందుకు అర్హులని తెలిపారు. సుమారు 100 మందికి పైగా ఏజెంట్లను నియమిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు సూర్యాపేట హెడ్ పోస్టాఫీస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మిర్యాలగూడ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోనివారు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9985392675 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

హాలియా : ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా హాలియాకు చెందిన ముదిగొండ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ముదిగొండ వెంకటేశ్వర్లును నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిగొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేయాలి



మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కళాశాల ప్లాన్‌ను పరిశీలించి లోపాలుంటే సరిచేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ మెడిసిన్ సెంటర్‌కు అవసరమైన హాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఆలస్యమవడానికి గల కారణాలపై ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఇసుక వల్ల ఆలస్యమైందని ఇంజనీర్లు తెలపగా.. భవన నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని ఇంజనీర్లు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ నిత్యానందం, కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి రక్షించడంతో పాటు నాటిన ప్రతిమొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటంతో పాటు రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర, అధికారులు రాజ్యలక్ష్మి, ప్రేమ్‌కరణ్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రవణ్, మురళి, కళ్యాణచక్రవర్తి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు శాలిగౌరారం ఎస్ఐ

- మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన ఘటనలో చర్యలు
- విచారణ అనంతరం వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు
- నూతన ఎస్ఐగా సైదులు నియామకం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : 'నాతో మంచిగా ఉండు.. నీ అవసరాలు తీరుస్తా...' అంటూ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఓ మహిళ చేసిన ఫిర్యాదు నేపథ్యంలో శాలిగౌరారం ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్‌పై ఎట్టకేలకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఆయనను వెకెన్సీ రిజర్వ్‌లో (వీఆర్) పెడుతూ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే రిలీవ్ కావాలని అందులో పేర్కొన్నారు. ఆయన స్థానంలో దేవరకొండ ఎస్ఐగా పని చేస్తున్న డి.సైదులును శాలిగౌరారం పీఎస్‌కు బదిలీ చేశారు. ఓ కేసులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తన పట్ల ఎస్ఐ అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా పలు రకాల మాటలతో అసభ్యకరంగా వ్యవహరించారంటూ గత నెల 26వ తేదీన శాలిగౌరారం మండలానికి చెందిన ఓ మహిళ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ విచారణకు ఆదేశించారు. విచారణ జరిపిన అధికారులు నివేదికను అందజేశారు. 15 రోజుల తరువాత ఆ నివేదిక ఆధారంగా ఎస్ఐపై చర్యలు చేపట్టారు.

అసలేం జరిగిందంటే..

శాలిగౌరారం మండలానికి చెందిన ఓ మహిళ భర్త రెండో వివాహం చేసుకొని తనకు చేసిన అన్యాయం చేశాడని, న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఆశ్రయించింది. ఆ ఫిర్యాదును తీసుకున్న పోలీసులు ఆమె భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ విషయంలో సదరు మహిళ పలుమార్లు పోలీస్‌స్టేషన్ వెళ్లారు. ఈ క్రమంలో ఏప్రిల్ 16వ తేదీన స్టేషన్‌కు వెళ్లిన ఆ మహిళలతో ఎస్ఐ అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను తల్లిదండ్రులతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సమయంలో తనతో కొన్ని విషయాలు మాట్లాడేది ఉందని, మీరు బయట ఉండండంటూ తన తల్లిదండ్రులను ఎస్ఐ బయటికి పంపించారని.. అనంతరం కుటుంబ పరమైన విషయాలతో పాటు వ్యక్తిగత(ఒంటరి) విషయాలు, దాంపత్య విషయాలను ఎస్ఐ అడిగారని ఫిర్యాదులో పేర్కొంది. తనతో టీ పెట్టించుకోవడమే కాకుండా చేపలకూర, చికెన్ కర్రీ వండుకొని తీసుకురావాలని, ఎక్కడికి తీసుకురావాలో చెబుతానని మాట్లారని, అంతేకాకుండా 'నీకంటే మీ అమ్మ బాగుంటుంది..' అని మాట్లాడారని, తనపట్ల అనుచితంగా ప్రవర్తించిన ఎస్ఐపై చర్యలు చేపట్టాలని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ఎస్పీ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఆ విచారణ అనంతరం ఎట్టకేలకు చర్యలు చేపట్టారు.

ఫలించని ప్రయత్నాలు

మహిళను వేధింపులకు గురిచేసిన కేసు నుంచి బయట పడేందుకు ప్రవీణ్‌కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఓ పార్టీ ముఖ్యనేతల్లో కొందరు ఎస్ఐని ఈ ఆరోపణల నుంచి బయట పడవేసేందుకు బాధ్యతను తీసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగింది. రాజీకి రావాలని కూడా సదరు మహిళ, ఆమె తల్లిదండ్రులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు గతనెల 26న రాష్ట్ర డీజీపీకి రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు పంపింది. అయితే.. బాధిత కుటుంబం ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి సహకారంతో ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని స్థానిక నేతలు రాజకీయ ఆధిపత్యంగా తీసుకున్నట్లు తెలిసింది. తమను కాదని సదరు రాజకీయ నాయకుడి ద్వారా ఎస్పీ వద్దకు వెళతావా.. అంటూ ఓ పార్టీకి చెందిన స్థానిక నేతలు ఎస్ఐకి మద్దతుగా నిలిచినట్లు తెలిసింది.

మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు



షీటీమ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : మహిళలను వేధించిన వారికి కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఆయన మంగళవారం నల్లగొండలోని మహిళా పీఎస్, భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కేంద్రంలో అందించే న్యాయ సలహాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. షీటీమ్ బృందాలు జన సమూహాలు ఉండే ప్రాంతాలైన బస్టాండ్, రైల్వేస్టేషన్, విద్యాలయాలు తదితర ప్రాంతాల్లో డేగ కళ్లతో నిరంతరం పర్యవేక్షిస్తుంటాయన్నారు. మహిళా సమస్యలపై షీటీమ్ –87126 70235, ఎస్పీ–87126 70200, షీ టీమ్ ఇన్‌చార్జి సీఐ– 87126 70143, మిర్యాలగూడ ఇన్‌చార్జి ఎస్ఐ–80960 04465 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న రైతు

- ఎనిమిది నెలల క్రితం కూలీకి వచ్చి గొలుసు పోగొట్టుకున్న మహిళ
- పత్తి చేనులో గుంట్క కొడుతుండగా దొరకడంతో ఆమెకు అప్పగింత



లక్ష్మమ్మకు నల్లపూసల గొలుసు అందజేస్తున్న రైతు యాదయ్య భార్య

మునుగోడు: పత్తి చేనులో మహిళా కూలీ పోగొట్టుకున్న నల్లపూసల గొలుసును తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు రైతు. కనగల్ మండలం జి. యడవల్లికి చెందిన మండలి లక్ష్మమ్మ మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన రైతు బొందు యాదయ్య పత్తి చేనులో ఎనిమిది నెలల క్రితం పత్తి తీసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో లక్ష్మమ్మ మెడలో ఉన్న నల్లపూసల గొలుసును పోగొట్టుకుంది. ఎంత వెతికినా గొలుసు దొరకలేదు. రైతు యాదయ్య ఈ ఏడాది కూడా పత్తి చేను వేసి మంగళవారం గుంట్క కొడుతుండగా నాగలికి తగిలి నల్లపూసల గొలుసు దొరికింది. యాదయ్య లక్ష్మమ్మకు విషయం చెప్పి గ్రామానికి పిలిపించి గొలుసును ఆమెకు అందజేశాడు. గొలుసు విలువ రూ.80వేలు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. రైతు యాదయ్యను గ్రామస్తులు అభినందించారు.

108 వాహనంలో ప్రసవం



బిడ్డను చూపుతున్న 108 వాహన సిబ్బంది

మోతె: గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా 108 వాహనంలో ప్రసవించింది. మోతె మండలం సిరికొండ గ్రామానికి సిరికొండ గ్రామానికి చెందిన డి. త్రిషకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు గ్రామానికి చేరుకుని 108 వాహనంలో త్రిషను సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ వెంకటరాములు, పైలెట్ ప్రభాకర్ తదితరులు కలిసి కాన్పు చేయగా.. మగ బిడ్డకు జన్మనిచ్చింది.

పాముకాటుతో వ్యక్తి మృతి

వలిగొండ: పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని నాతాళ్లగూడెంలో జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాతాళ్లగూడేనికి చెందిన ఉద్దగిరి ఎల్లయ్య(60) సోమవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమిలో గడ్డి కోస్తుండగా పాము కాటువేసింది. పక్కనే గడ్డికోసే గమనించి అతడిని 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నూతనకల్: కుటుంబ కలహాలతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం యడవెల్లి గ్రామానికి చెందిన నెల్లుట్ల మురళి(38) కుటుంబ కలహాలతో ఈ నెల 2వ తేదీన తన అత్తగారి ఊరైన చిల్పకుంట్లలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుద్యోగులకు బాసటగా..

- ఏడాది క్రితం మహిళా ప్రాంగణంలో జెడ్పీ స్టడీ సెంటర్ ఏర్పాటు
- ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సాధించిన 24 మంది
- తాజాగా జేఎల్ సాధించిన ఇద్దరు, గ్రూప్–1 మెయిన్స్‌కు 14 మంది అర్హత



జిల్లా పరిషత్ స్టడీ సెంటర్‌లో చదువుకుంటున్న నిరుద్యోగులు

నల్లగొండ : జెడ్పీ స్టడీ సెంటర్ నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలోని రాంనగర్ సమీపంలో మహిళా ప్రాంగణంలో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ స్టడీ సెంటర్‌లో చదువుకుని ఇప్పటి వరకు 24 మంది వివిధ రకాల ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. తాజాగా టీఎస్‌పీఎస్ విడుదల చేసిన ఫలితాల్లో ఇద్దరు జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపిక కాగా.. గ్రూప్–1 మెయిన్స్‌కు 14 మంది అర్హత సాధించారు. మహిళా ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించడం విశేషం.

2023 మే నెలలో ప్రారంభం..

మహిళా ప్రాంగణంలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన మూడు ఎకరాల స్థలంలో భవనం ఉంది. ఉద్యోగాల ప్రిపేర్ అయ్యేందుకు యువతీయువకులు పడుతున్న ఇబ్బందులను గమనించి అప్పటి జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి 2023 మేలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేశారు. నిరుద్యోగులు అవసరమైన పుస్తకాలతో పాటు కుర్చీలు, నీటి వసతి కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సెంటర్‌లో చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ హాల్ కెపాసిటీ 84 మందికి ఉండగా.. రోజూ 105 నుంచి 110 మంది వరకు వచ్చి చదువుకునే వారు. కలెక్టర్ సహకారంతో మధ్యాహ్న భోజనాన్ని కూడా అందిస్తున్నారు. ఇది నిరుపేద నిరుద్యోగ యువతకు వరంలా మారింది.



జెడ్పీ స్టడీ సెంటర్

స్టడీ సెంటర్ ఎంతో ఉపయోగపడింది



మాది సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామం. జిల్లా పరిషత్ స్టడీ సెంటర్‌లో చదువుకునేందుకు అన్ని వసతులు కల్పించారు. బుక్స్ కూడా ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత భోజనం అందించారు. నేను కష్టపడి చదివి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం పొందగలిగా. నేను ఉద్యోగం సాధించేందుకు స్టడీ సెంటర్ ఎంతో ఉపయోగపడింది. – ఉమా లక్ష్మీనారాయణ

పైసా ఖర్చు లేకుండా చదువుకున్నా



మాది ఖమ్మం జిల్లా. చదువుకునేందుకు నల్లగొండ వచ్చాను. జిల్లా పరిషత్ స్టడీ సెంటర్‌లో పైసా ఖర్చు లేకుండా చదువుకునే అవకాశం కల్పించారు. రోజు ఉదయం వెళ్లి రాత్రి వరకు అక్కడే ఉండి చదువుకున్నా. హిస్టరీ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యా. రాష్ట్ర వ్యాప్తంగా 27వ ర్యాంకు సాధించాను. చాలా సంతోషంగా ఉంది. – కె. పరమేష్

భారీగా పట్టుబడిన రేషన్ బియ్యం

కోదాడరూరల్: కోదాడ మండలం కాపుగల్లు శివారులో రెండు రోజుల క్రితం పీడీఎస్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని లింగాలలో భారీగా పీడీఎస్ బియ్యాన్ని కోదాడ రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన సాంబశివరావు రెండు రోజులు క్రితం పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తూ కోదాడ మండలం కాపుగల్లు శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిచ్చిన సమాచారం మేరకు జగ్గయ్యపేటకు చెందిన మరో వ్యాపారి కోటేశ్వరావును అదుపులోకి తీసుకొని విచారించగా.. అతడు వత్సవాయి మండలం లింగాలకు చెందిన నర్సింహారావుకు పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నట్లు తెలిపాడు. దీంతో కోటేశ్వరరావు, నర్సింహారావుపై కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి లింగాలలోని నర్సింహారావుకు చెందిన బియ్యం డంపింగ్ కేంద్రంపై దాడి చేసి 650 బస్తాల్లో ఉన్న 32.5టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. నర్సింహారావు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

పాలకవీడులో 40 క్వింటాళ్లు..

పాలకవీడు: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం ఉదయం పాలకవీడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండల పరిధిలోని జాన్‌పహాడ్ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా మండలంలోని కోమటికుంట గ్రామం నుంచి దామరచర్ల మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపాడని ఎస్ఐ పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బంగారుగడ్డలో 11 క్వింటాళ్లు..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 11.20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ కాలనీలో షేక్ అమన్, మాదినేని నాగార్జున అనే వ్యక్తులు ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పీడీఎస్ బియ్యం నిల్వ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టూటౌన్ సీఐ తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడి చేసి 11.20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



మిర్యాలగూడ అర్బన్: పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

మిర్యాలగూడ పట్టణంలో 72 బస్తాలు..

మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌కు చెందిన అవదారపు రాము ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 72 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి పట్టుబడిన బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. ఈ మేరకు రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మేళ్లచెరువులో 5 క్వింటాళ్లు..

మేళ్లచెరువు: మండల పరిధిలోని కందిబండ గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు. ఈ మేరకు ఇంటి యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మఠంపల్లిలో 250 క్వింటాళ్లు..

మఠంపల్లి : ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 250క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండల పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అల్లీపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు గ్రామసమీపంలో ఓ రైస్‌మిల్లు ఉంది. అందులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో దాడులు నిర్వహించి 250క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యం బస్తాలను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా మిల్లు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బియ్యం సీజ్ చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

గడ్డిమందు తాగి యువతి ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

వేములపల్లి (మాడ్గులపల్లి): గడ్డి మందు తాగిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన కొత్త కల్యాణి (23) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. యువతి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



జనార్దన్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మూకుమ్మడి దాడిలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దాడి చేసిన వారిపై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ములకపల్లి సతీష్ అలియాస్ చింటు, కుంచం విక్రం రెండు నెలల క్రితం గ్రామంలోనే గొడవపడ్డారు. అదే సమయంలో వస్కుల జనార్దన్(34) అటుగా వెళ్తూ.. రోడ్డుపై ఎందుకు గొడవపడుతున్నారు, ఇంటికి వెళ్లమని వారిద్దరిని వారించాడు. దీంతో జనార్దన్‌పై విక్రం కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 7వ తేదీన కుంచం విక్రమ్‌కు ఓ దుకాణం వద్ద జనార్దన్ తారసపడ్డాడు. ఇరువురు గొడవపడ్డారు. ఈ విషయాన్ని విక్రం తన తల్లిదండ్రులు కుంచం శ్రీను, ఎల్లమ్మ, తమ్ముడు అజిత్‌కు ఫోన్ చేసి చెప్పగా.. వారంతా వచ్చి మూకుమ్మడిగా జనార్దన్‌పై దాడి చేశారు. దీంతో స్పృహ కోల్పోయిన జనార్దన్‌ను అతడి బంధువులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి అన్న వస్కుల కొండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడిచేసిన నలుగురిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని బాలిక బలవన్మరణం

సూర్యాపేట టౌన్: మతిస్థిమితం లేని బాలిక పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన చింతా జాన్ విల్సన్ కుమార్తె చింత శ్రీనిధి(15)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. మనస్తాపంతో ఈ నెల 6వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

సాగర్ డ్యాంను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్లు



నాగార్జునసాగర్ డ్యాం వద్ద అసిస్టెంట్ కలెక్టర్లు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాంను మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల అసిస్టెంట్ కలెక్టర్లు సందర్శించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వీరు తెలంగాణ దర్శన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగార్జునసాగర్‌కు చేరుకుని బుద్ధవనాన్ని సందర్శించారు. మంగళవారం నాగార్జునసాగర్ డ్యాంను, గ్యాలరీలను వీక్షించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ ప్రాజెక్టు ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు నాగార్జునసాగర్ జలాశయంలో లాంచీలో విహరించారు. వీరితో పాటు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ పెద్దబోయిన, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వర్ రావు, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, సాగర్ డ్యాం ఏఈ కృష్ణయ్య, విజయ విహార్ మేనేజర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

త్రిపురారం : రైతులు కూరగాయల సాగు చేయడంతో తక్కువ సమయంలో అధిక లాభాలు సాధిస్తూ నిత్యరాబడి పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్‌లో షెడ్ నెట్ల కింద కూరగాయల నారు పెంపకంపై జిల్లాలోని రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చితే కూరగాయల సాగుతో అధిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. జిల్లాలోని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కేవీకేలో షెడ్ నెట్ల కింద కూరగాయల నారు పెంపకంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. సాగు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటిస్తే కూరగాయల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్య రక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆరుగురు
- 235గ్రా. గంజాయి, 6 సెల్‌ఫోన్‌లు, ఒక కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న యువకులను మంగళవారం హుజూర్‌నగర్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ చరమందరాజు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. వీరమల్ల ఉపేందర్, షేక్ రజి అఫ్రోజ్, మీసాల గోపి, చిల్ల వికాస్, సయ్యద్ రహమద్ బాబా అలియాస్ సోహైల్, షేక్ బాల సైదా అలియాస్ తుఫాన్ సైదా స్నేహితులు. వీరంతా గత నెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో గంజాయి కొనుగోలు చేసేందుకు నూకపంగు రాజు కారును కిరాయికి తీసుకుని వెళ్లారు. అందరు కలిసి రూ.20వేలు పోగు చేసి అరకులో 5కేజీల గంజాయి కొనుగోలు చేసి అదే నెల 27వ తేదీన హుజూర్‌నగర్‌కు వచ్చారు. అందులో కొంత గంజాయిని వారు తాగారు. వారిలో నలుగురు యువకులు తమ స్నేహితులైన హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన షేక్ యాసిర్, బత్తిని ఉమేష్‌కు మంగళవారం స్థానిక లింగగిరి రోడ్డులోని కాటమయ్య గుడి వెనుక గంజాయి విక్రయిస్తుండగా.. ఎస్ఐ ముత్తయ్య ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సోహైల్, తుఫాన్ సైదా పరారీలో ఉన్నారు. వారి నుంచి 235గ్రా. గంజాయి, 6 సెల్‌ఫోన్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ బల రామిరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఫేక్‌కాల్స్‌తో డబ్బులు వసూలు

- సమీప బంధువునంటూ ఫోన్‌చేసి మోసాలకు పాల్పడుతున్న కేటుగాడు
- ఓ మినీ ఏటీఎంకు రూ.50వేలు పంపి మోసపోయిన మిర్యాలగూడ రియల్టర్



దామరచర్ల మండలం కొండ్రపోలులోని ఓ మినీ ఏటీఎం వద్ద సీసీఫుటేజీలో అనుమానిత వ్యక్తి

మిర్యాలగూడ అర్బన్ : మీ బంధువునూ అర్జెంట్‌గా డబ్బులు అవసరం ఉన్నాయి.. డబ్బులు పంపించూ.. తిరిగి మళ్లీ ఇచ్చేస్తాను.. అంటూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడు ఓ కేటుగాడు. ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా వందలాది మందిని ఇలా ఫేక్ కాల్స్‌తో వారితో మాట్లాడి డబ్బులు మినీబ్యాంక్ అకౌంట్, పెట్రోల బంకుల సిబ్బందికి వేయించుకుని దొరక్కకుండా మోసాలకు పాల్పడుతున్నాడు గుర్తుతెలియని దుండగుడు. ఇలా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ రియల్టర్‌కు ఫోన్ చేసిన సదరు మోసగాడి మాటలు నమ్మి రూ.50వేలు ఓ మినీ బ్యాంకు ఏటీఎంకు పంపాడు. అక్కడితో ఆగకుండా మరో రూ.20వేలు పంపాలని కోరడంతో అనుమానం వచ్చిన బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అతడికి వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు దొరికిన కాల్‌డేటాతో దాదాపు 15వందల మంది వరకు నిందితుడి బారిన పడి ఉంటారని తెలుస్తుంది. ఆ కాల్‌డేటాతో ఓ నంబర్‌కు ఫోన్‌చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన ఓ బాధితుడు బోరున విలపిస్తూ తాను రూ.90వేలు పంపానని వాపోయినట్లు సమాచారం. కాగా సదరు మోసగాడు దామరచర్ల మండలం కొండ్రపోలు వద్ద గల మినీ ఏటీఎం వద్ద అనుమానిత వ్యక్తి తచ్చాడినట్లు సీసీఫుటేజీలో గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే మోసగాడిపై పలువురు బాధితులు సైబర్ క్రైం పోలీసులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.


అప్రమత్తంగా ఉండాలి

ఫేక్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా డబ్బులు పంపమని అడిగితే ఎవరూ స్పందించొద్దు. ఓటీపీ నంబర్లు కాని వ్యక్తి గత అకౌంట్ల వివరాలు తెలియని వ్యక్తులకు చెప్పొద్దు. ఎవరైనా మోసపోతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సుధాకర్, వన్‌టౌన్ సీఐ మిర్యాలగూడ

'పుడమి' బాధితులకు న్యాయం జరిగేనా..?

- అధిక వడ్డీ ఆశచూపి రూ.వందల కోట్లు కొల్లగొట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన పలువురు బాధితులు
- మోసగాళ్ల పూర్తిస్థాయి వివరాలు సేకరించిన పోలీసులు



పెట్టుబడిగా తీసుకున్న రూ.10 లక్షలకు రశీదు ఇచ్చిన నిర్వాహకులు

మునుగోడు: పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించగా.. కంపెనీ నిర్వాహకుల పూర్తిస్థాయి వివరాలు సేకరించినట్లు సమాచారం. మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు నల్లగొండ జిల్లాకు చెందిన మరో వ్యక్తి కలిసి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బోడుప్పల్‌లో డివైన్ డెవలపర్స్ పేరుతో 2021లో కార్యాలయం ప్రారంభించారు. ఆ ముగ్గురు వ్యక్తులు తమకు పరిచయం ఉన్న వారి నుంచి పెట్టుబడులు తీసుకుని ఆ డబ్బులతో వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మితే వచ్చే లాభంలో రూ.లక్ష పెట్టుబడికి వారికి ప్రతినెలా రూ.10వేల చొప్పున, రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన వారికి 20 నెలల పాటు ప్రతినెలా రూ.లక్ష వడ్డీతో పాటు ఒక ప్లాటు రిజిస్ట్రేషన్ చేస్తామని నమ్మించారు. ఇరవై నెలలు ముగిశాక రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటు అమ్మి వచ్చిన నగదు కూడా చెల్లిస్తామని చెప్పారు. ఇది నమ్మి కొంతమంది పెట్టుబడి పెట్టడంతో ఆ డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగించారు. రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టిన వారికి ప్రతి నెలా వడ్డీతో పాటు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఈ వ్యాపారం బాగుందని మరికొంత మంది పెట్టుబడి పెట్టేందుకు ముందకురావడంతో 2023లో డివైన్ డెవలపర్స్ బోర్డు మార్చి పుడమి ప్రాజెక్ట్స్ పేరుతో కార్యాలయం తెరిచారు. పెట్టుబడిదారుల పెట్టిన వారి సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు వడ్డీలు, ప్లాట్లు ఇచ్చిన సక్రమంగా ఇచ్చిన నిర్వాహకులు పెట్టుబడిదారుల సంఖ్య భారీగా పెరగడంతో ఆ నగదుతో తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేరుతో ఆస్తులు కొనుగోలు చేసి ఇదే అదునుగా కంపెనీ ఎత్తేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. తమకు తెలిసిన వారి ద్వారా పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో ఒక్క మునుగోడు నియోజకవర్గానికి చెందిన వారే 300మందికి పైగా ఉన్నట్లు సమాచారం. కంపెనీ బోర్డు ఎత్తేయడంతో పెట్టుబడి పెట్టిన వారు లబోదిబోమంటున్నారు.

మోసగాళ్ల వివరాలు సేకరించిన పోలీసులు..

అమాయక ప్రజలను మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీ నిర్వాహకుల పూర్తి సమాచారాన్ని పోలీసులు సేకరించినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం పలువురు బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ అప్పటి నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తిని ఆశ్రయించగా.. ఎస్పీ స్పందించి బాధితుల నుంచి దరఖాస్తు తీసుకుని మోసగాళ్ల వివరాలను టాస్క్‌ఫోర్స్ అధికారులకు అప్పగించగా అజ్ఞాతంలోకి వెళ్లిన ముగ్గురు వివరాలను సేకరించినట్లు తెలిసింది. కానీ నేటికీ ఆ మోసగాళ్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఫిర్యాదు తీసుకున్నారు



నేను పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో రూ.18 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాను. ఈ విషయాన్ని రెండు నెలల క్రితం అప్పటి ఎస్పీ చందనాదీప్తికి వివరించగా.. ఫిర్యాదు రాసివ్వాలని సూచించడంతో అప్పుడే ఫిర్యాదు రాసి ఇచ్చాను. కానీ ఇప్పటి వరకు పుడమి నిర్వాహకులను పిలిపించలేదు. నూతనంగా వచ్చిన ఎస్పీ అయినా చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

– పోలగొని సైదులు, చీకటిమామిడి

అప్పు చేసి పెట్టుబడి పెట్టా..



పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీతో పాటు ప్లాట్లు ఇస్తున్నారని నాకు నా స్నేహితుడు చెబితే అప్పుచేసి రూ.8 లక్షల పెట్టుబడి పెట్టినా. పెట్టిన పెట్టుబడికి రెండు, మూడు నెలల పాటు వడ్డీ ఇచ్చారు. ఆ తర్వాత ఇవ్వడం మానేశారు. ఇదేమిటని నిర్వాహకులను ప్రశ్నిస్తే త్వరలో ఆస్తులు అమ్మి నా డబ్బులు నాకు తిరిగి ఇస్తామని నమ్మించారు. కానీ నేటికీ ఇవ్వలేదు. నేను మోసపోయానని తెలిసి పోలీసులను ఆశ్రయించా.

– ఈదులకంటి రమేష్, ఎల్లలగూడెం